క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెహ్రూనగర్: ప్రతి సోమవారం ప్రజల నుంచి స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను మిలాద్ ఉన్ నబీ పండుగ కారణంగా రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో రజకులపై పెరిగిపోతున్న దాడులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో రజకులపై దాడులు పెరిగిపోతున్నాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేట యలమందల గ్రామానికి చెందిన నూతలపాటి సుబ్బారావుపై దాడి చేయడం బాధాకరమన్నారు. బాధితుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా రజకులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని వీఆర్ విత్ యూ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.అయ్యప్ప అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం యువజన సర్వీసుల శాఖ స్టెప్, స్వశక్తి గుంటూరు ఆధ్వర్యంలో వీఆర్ విత్ యూ ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సంస్థ చైర్మన్ అయ్యప్ప ప్రారంభించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రధానంగా యువత స్వచ్ఛందంగా ముందుకు రావల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం 80 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రమాద బీమా(లక్షరూపాయల)పత్రాన్ని అందజేశారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం

లక్ష్మీపురం: ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం చేసుకోవాలని సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నాగేంద్ర అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. నాగేంద్రను ఘనంగా సత్కరించారు.

తెలుగు భాషా, పద్యాల ప్రాధాన్యం మరిచిపోవద్దు




నగరంపాలెం: రామబ్రహ్మం నిగర్వి, సాధుస్వభావుడు, చతురుడు అని మహర్షి బాదరీనారాయణ్ వ్యాససమ్మాన్, రాష్ట్ర పతి పురస్కార గ్రహీత ఆచార్య అద్దంకి శ్రీనివాస్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కళావేదికపై ఆదివారం ఉదయం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ అధ్యక్షులు గుళ్లపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో భాషాసమ్మాన్ పురస్కారగ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. సభకు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక ప్రముఖ పురస్కారాలతోపాటు భాష సమ్మాన్ ఆయన నిరంతర కృషికి నిదర్శనమని అన్నారు. సన్మానగ్రహీత రామబ్రహ్మం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలుగు భాషా సాహిత్య సుస్థిరతకు కృషి చేయాలని చెప్పారు. సభలో కొమాండూరు రంగనాథాచార్యులు, డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, సంస్థ కన్వీనర్ రాఘవేంద్ర, నేహా పాల్గొన్నారు.

సమగ్ర కుల గణన చేపట్టాలి

నెహ్రూ నగర్: కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి జనగణనతో పాటే, సమగ్ర కుల గణనను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1931 తరువాత ఒక్క ఎస్సీ ఎస్టీల జనగణనలో కుల గణనతో పాటు వారి విద్యార్హతలు, ఆర్థిక స్థితిగతులన్నింటినీ నమోదు చేశారు తప్ప, పదేళ్లకోసారి జరిపే జనగణనలో మిగతా ఏ సామాజిక వర్గాల కులగణనను జరపలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలతో పాటు జనరల్ కేటగిరీకి చెందిన అన్ని కులాలు, ఉపకులాల జనాభా లెక్కలు త్వరలో చేపట్టిన జాతీయ స్థాయి జనగణనతో పాటే జరపాలన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం



శ్రీనగర్ ఒకటో లైనులో కొలువైన వినాయకుడు



గణపతి విగ్రహం వద్ద మాజీ మంత్రులు అంబటి, మేరుగ, ఎమ్మెల్సీ లేళ్ల, మేయర్ కావటి, మండపాటి

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేటలో నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఆలా సాంబశివరావు ఆధ్వర్యంలో 40వ గణపతి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామి వారిని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు, మేయర్ కావటి మనోహర్ నాయుడు హాజరై దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా విఘ్నేశ్వర అభిషేకాలు

భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్, శ్రీగణేష్ ఉత్సవ మండలి(లక్ష్మీపురం) సంయుక్త ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ ధార్మిక ప్రాంగణం శివపార్వతుల వేదికపై ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ నిమజ్జన సందర్భంగా ఆదివారం యాగశాలలో శాస్త్రోక్తంగా విఘ్నేశ్వర అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీగణపతి, రుద్ర చండీ హోమలను తొమ్మిది మంది రుత్వికులతో చేపట్టి, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. దైవ కార్యక్రమాలను బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శ్రీగణేష్ ఉత్సవ మండలి కార్యవర్గ సభ్యులు, శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ పాలక మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

వినాయక చవితి పండుగ సందర్భంగా 18వ డివిజన్ శ్రీనివాసరావుపేట ఒకటో వీధిలో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తమ్మిశెట్టి తేజ, చల్లా శివదుర్గ, తమ్మిశెట్టి కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపతికి మేయర్ పూజలు

తూర్పులోని 13, 15, 56, 57 డివిజన్లల్లోని గణేష్ మండపాలు, పందిళ్లల్లో గణపతిని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌రెడ్డి, చంద్రరెడ్డి, సంగడిగుంట సాయిలక్ష్మి, సిద్దుల శ్రీను పాల్గొనగా, అనంతరం అన్నదానం నిర్వహించారు.

నడింపల్లివారి వీధిలో..

గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేట నడింపల్లివారివీధిలో ఎంఎస్ యూత్ ఆధ్వర్యంలో 8వ గణేష్ మహోత్సవాల్లో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలను ఆనందోత్సాల మధ్య జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత చంద్రశేఖర్, ఉత్సవ నిర్వాహకులు మండల సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, శ్రీనివాస్ దంపతులు, జంగాలపల్లి పార్థసారథి, డి.శ్రీనివాస్, పి.ప్రసాద్, చిక్కం శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైలుపేటలో.. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



గణపతి పూజల్లో నూరిఫాతిమా



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు వేగంగా చేయాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో డ్రెయిన్ల మీద ఆక్రమణల తొలగింపు వేగంగా జరుగుతుందని, దశలవారీగా నగరంలోని డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్‌లో డ్రెయిన్ల ఆక్రమణలు తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణలను దశల వారీగా పూర్తి స్థాయిలో తొలగిస్తామని స్పష్టం చేశారు. ఓల్డ్ క్లబ్ రోడ్‌లో కొన్ని హాస్పిటల్స్ డ్రెయిన్లపై శ్లాబ్‌లు వేసి జనరేటర్లు, కార్ పార్కింగ్‌లకు వినియోగిస్తున్నారని, దీనివలన డ్రెయిన్లలో ఉన్న సిల్ట్ తీయడానికి వీలు లేకుండా పోతుందన్నారు. డ్రెయిన్ మీద ఉన్న ప్రతి ఆక్రమణ తొలగించాల్సిందేనన్నారు. పర్యటనలో కార్పొరేటర్ పి.సమత, తూర్పు ఎంహెచ్‌ఓ (ఇంచార్జి) రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ అయూబ్ ఖాన్, టీపీఎస్ రసూల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాలతో కూడిన కిట్స్ అందించిన గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యుల చొరవ అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక కన్నావారి తోటలోని గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యులు విజయవాడ సింగ్ నగర్‌లో వరద బాధితులకు అందించనున్న 400 కిట్స్ వాహనాన్ని నగర కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సంఘ కాపరి రెవ.ఎం.గాబ్రియేలు, అసోసియేట్ పాస్టర్ టి.ఈనక్ జార్జ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రైవేట్ ట్యాంకర్లతో నీటి సరఫరా నిలుపుదల

గుంటూరు నగరపాలక సంస్థ రిజర్వాయర్ల నుంచి ప్రైవేట్ ట్యాంకర్లకు తాగునీటి సరఫరా నిలుపుదల చేయాలని, త్వరలో ఆయా ట్యాంకర్లకు నీటిని అందించే అంశంపై నిర్ణయిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుజ్జనగుండ్ల, పెద్ద పలకలూరు రోడ్‌లోని జీఎంసీ రిజర్వాయర్లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పెద్ద పలకలూరు, ఉద్యోగ నగర్ ప్రాంతాల్లో పర్యటించి ఆదివారం విధులకు హాజరు కాని ఎన్విరాన్మెంట్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. స్థానిక ఉద్యోగ నగర్‌లోని జీఎంసీ రిజర్వ్ స్థలాలను పరిశీలించి, వాటి ప్రస్తుత స్థితి, అభివృద్ధిపై తగిన ప్రతిపాదనలతో రావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

మళ్లీ రోడ్డెక్కిన చిరు వ్యాపారులు

మధువన్ యాజమాన్యం దౌర్జన్యంపై నిరసన

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్ వద్ద హోటల్ మధువన్ యజమానులు మరోసారి రెచ్చిపోయారు. రెండు రోజుల క్రితమే పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనప్పటికీ ఏ మాత్రం ఖాతరు చేయటం లేదు. వారి వెహికల్ పార్కింగ్‌కు అడ్డంగా ఉందని ఇప్పటికే షాపు తొలగించి వివాదానికి తెరదీసిన హోటల్ యాజమాన్యం ఆదివారం మరోసారి వివాదానికి తెరలేపారు. 25 సంవత్సరాలుగా ఖాజామొహీద్దీన్ చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన మధువన్ యాజమాన్యం వారి పార్కింగ్‌కు అడ్డు వస్తోందని, దుకాణాన్ని కూలివేశారు. దీనిపై పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. అయితే ఆదివారం ఖాజామొహీద్దీన్ తన మనుషులతో కలసి దుకాణం కట్టుకునే ప్రయత్నం చేశారు. మరోమారు మధువన్ యజమానులు ఖాజామొహీద్దీన్, చిరువ్యాపారుల సంఘం, ఎస్ఎస్‌యూఐ నేతలతో వాగ్వాదానికి దిగారు. దుకాణం ఏర్పాటు చేయటానికి వీలు లేదంటూ దౌర్జన్యానికి దిగి పడగొట్టారు. దీంతో బాధితులు, సంఘాల నేతలు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాస్తారోకోకు దిగారు. మధువన్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దౌర్జన్యంగా, అక్రమంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న పాత గుంటూరు పోలీసుస్టేషన్ సీఐ వై.వీరసోమయ్య పడగొట్టిన దుకాణాన్ని పరిశీలించి, ఆందోళనకారులకు సర్దిచెప్పారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు.



సీఐ వైవీ సోమయ్యకు వివరిస్తున్న వ్యాపారులు

దేశాన్ని విశ్వగురు పీఠస్థానంపై నిలపాల్సింది ఉపాధ్యాయులే



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశాన్ని విశ్వగురుపీఠస్థానంపై నిలపాల్సింది ఉపాధ్యాయులేనని ప్రముఖ పారిశ్రామికవేత్త తాళ్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని కమ్యూనిటీ హాల్లో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల విజయభేరి విద్యా సదస్సు నిర్వహించారు. సభాధ్యక్షుడు డి.శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు విద్యాసదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త టి.సంపత్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు బి.కరీముల్లా చౌదరి, జువ్వా జ్ఞానేశ్వరరావు, బందనాదం కుమార్‌రాజు, నాయకులు కె.పద్మకోటి, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మల, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈఓలు అబ్దుల్ ఖద్దూస్, రమణయ్య, రవికాంత్, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, బాల సుందర్‌రావు, పినాకపాణి, హెచ్ఎంలు రాజేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 60 గుండె బైపాస్ సర్జరీలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సీటీవీస్ వైద్య విభాగంలో 60 గుండె బైపాస్ సర్జరీలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే జీజీహెచ్‌కు విచ్చేసి గుండె ఆపరేషన్లు చేసిన వైద్య బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె ఆపరేషన్లు చేయాలని ముఖ్యంగా తాను చదువుకున్న గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్లు చేసేందుకు ముందుకొచ్చామన్నారు. సహృదయ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని సుమారు 600 పైగా బైపాస్ సర్జరీలు, మూడు గుండె మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో విజయవంతంగా చేశామన్నారు. జీజీహెచ్‌లో సీటీవీఎస్ వైద్య విభాగాన్ని పూర్తిగా బలోపేతం చేసి ఇక్కడి వైద్యులు గుండె ఆపరేషన్లు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. జీజీహెచ్ వైద్యులు డాక్టర్ పేరం కుప్పుస్వామి ఆధ్వర్యంలో విజయవంతంగా 60 బైపాస్ సర్జరీలు చేసినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో గుండె మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో జరిగేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే వెల్లడించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కంటే ఏపీలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె ఆపరేషన్లు ఎక్కువగా చేయటం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ కోనేరు సుధాకర్, డాక్టర్ పేరం కుప్పుస్వామి, డాక్టర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి నివాళి

లక్ష్మీపురం: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష, ప్రజాతంత్ర వాదులకు ఎంతో ఆవేదనకు గురి చేసిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం యోధుడు సీతారాం సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీరు ఎస్.సదాశివం పాల్గొన్నారు.

ఇంట్లో గొలుసు చోరీ

పట్నంబజార్: నివాసంలోని బంగారం చైన్ చోరీకి గురైన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. సూర్యనగర్‌లో నివాసం ఉండే క్షత్రియబాయ్ తన నివాసంలోని ఫ్రిజ్‌పై పెట్టిన బంగారం చైన్ కనపడకుండా పోయింది. అయితే గత కొద్ది రోజులుగా ఆమె నివాసంలో పెయింట్ పనులు చేస్తున్న కార్మికులు వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారుతీసారా ఇంకా ఎవరైనా చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. చైన్ సుమారు 17 గ్రాములు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజార్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు అయింది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణనగర్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు మోక్షగుండం స్ఫూర్తి

అంబటి మురళీకృష్ణ



విశ్వేశ్వరయ్య చిత్రపటం జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: భారతరత్న, డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లు అందరికి స్ఫూర్తి ప్రదాత అని, ఆయన అడుగుజాడలే నేటి తరం ఇంజినీర్లకు మార్గదర్శకమని బజరంగ్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్, ఇంజినీర్ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇంజినీర్స్ డే వేడుకలలో సందర్భంగా ఆదివారం గుంటూరు పట్టాభిపురంలోని బజరంగ్ అర్బన్ కార్యాలయంలో భారతరత్న, డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వర్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మానవ జీవితంలో యంత్ర పరికరాల వినియోగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎన్నో పనులను అత్యంత సులువుగా, బహుళ ప్రయోజనకరంగా చేసుకోవడానికి ఇంజినీరింగ్ అద్భుతాలే కారణమన్నారు. భారతావని గర్వించదగ్గ స్థాయిలో కృషి చేసిన ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారకంగా ఇంజినీర్స్ డే జరుపుకోవడం ముదావహమన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు, నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడంతో పాటు దసరా పండుగను పురస్కరించుకుని నిత్యావసరాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వ్యాపారవేత్త ఎం.రామలింగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా పలువురు ఇంజినీర్లు పానకాలు, నారాయణరావు, శివరాంప్రసాద్, మాజేటి ధీరజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఇంజినీరు పానకాలు రూ.36 వేలను పెన్షన్ స్కీమ్‌కి విరాళంగా అదంజేశారు. కార్యక్రమంలో కూర్నాల సతీష్, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు మద్ది సాయి రమేష్, వెంకట్రావు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు రంగంతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు ఉన్నాయని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం కొత్తపేట గుంటగ్రౌండ్ ఎదురుగా ఉన్న గుంటూరు పట్టణ ఫాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు 4,000 నోటు పుస్తకాలతో పాటు చేతి సంచులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఫ్యాన్సీ, స్టేషనరీ జనరల్ మర్చంట్ అసోసియేషన్ సామాజిక సేవలు అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు మాట్లాడుతూ ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ, కోశాధికారి అచ్యుత నిరంజన్, కె.సత్యం, కార్యవర్గ సభ్యులు వేమూరి వెంకట రామేశ్వరరావు గర్రె శ్రీరాములు, బచ్చు వెంకటసుబ్బయ్య, లక్ష్మీ శ్రీనివాసరావు, పాదర్తి వెంకటేశ్వర్లు, గల్లా రమేష్ కుమార్, చుండూరు దామోదర్‌రావు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

రజక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డి.రామారావు, వేదికపై పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

లక్ష్మీపురం: రజక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ డి.రామారావు అన్నారు. స్థానిక గుంటూరు కలెక్టర్ ఆఫీస్ ఆవరణలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రజక ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాల్సినందిగా సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు తాము ఉన్నామని ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా హాజరైన రజక ఉద్యోగులు త్వరలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బహ్మయ్య, ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బండి శ్రీనివాస రావు హాజరయ్యారు.